# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 12, మార్చి 2026




## వడదెబ్బతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

లక్షెట్టిపేట, మార్చి 11, ప్రభాతవార్త



పట్టణంలోని గోదావరి రోడ్ కొత్త ఫ్లాట్ల నివాసి, ట్రాక్టర్ డ్రైవర్ లకావత్ గణేష్ (45) వడదెబ్బతో మృతి చెందారు. మంగళవారం మధ్యాహ్నం ఎండ దెబ్బ తగిలిందని తన కుమారుడు రాజేశ్వర్‌కు తెలిపి, కూల్ డ్రింక్ కోసం డబ్బులు తీసుకుని బయటకు వెళ్లిన గణేష్ తిరిగి రాలేదు. బుధవారం ఉదయం మహానంద టాకీస్ వెనుక గల ఇటికల చెరువు ఒడ్డున ఆయన మృతదేహం లభ్యమైంది. ఎండ తీవ్రత వల్ల బహిర్భూమికి వెళ్లిన చోట కుప్పకూలి మరణించినట్లు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అన్వర్ హుస్సేన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ముగ్గురు సంతానం ఉన్నారు.

### జనాభా లెక్కల విధులు..

## సమర్థవంతంగా నిర్వహించాలి

**★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, మార్చి 11, ప్రభాతవార్త

జనాభా లెక్కల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి జిల్లాలోని మండలాల తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు జనాభా లెక్కల ప్రాతిపదిక ఉపయోగపడుతుందని తెలిపారు. జనాభా లెక్కల విధులను సక్రమంగా నిర్వహించాలని, తద్వారా ప్రజలకు అందించవలసిన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలపై ప్రభుత్వానికి అవగాహన వస్తుందని తెలిపారు. జనాభా లెక్కల ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగం, ఇతర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డిజిటల్ పద్ధతిలో జనాభా గణనను నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, లోప రహితంగా పూర్తి చేయాలని, జనగణన ద్వారా సేకరించే గణాంకాలు గ్రామ, పట్టణ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అభివద్ధి ప్రణాళికల మిగతా 2లో..



## స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా



# ఇందిరా మహిళా శక్తి పథకం

**✻ మంత్రి గడ్డం వివేకానంద**

జైపూర్, మార్చి 11, ప్రభాతవార్త

మహిళా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని,స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి కి ఇందిరా మహిళా శక్తి పథకం అమలు చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జైపూర్ మండలం ఇందారం గ్రామంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మండల తహసిల్దార్ వనజా రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, డిసిసి ప్రతినిధి రఘునాథ్ రెడ్డిలతో కలిసి గ్రామైఖ్య సంఘాల భవనాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ర మంత్రి వివేక్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ క్రమంలో 30 లక్షల రూపాయల వ్యయంతో 3 గ్రామైఖ్య సంఘాల భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో 3 కోట్ల 50 లక్షల రూపాయలతో 35 భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల,మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్, పెట్రోల్ బంకుల నిర్వహణతో పాటు ఇందిరా శక్తి క్యాంటీన్లు, పెరటి కోళ్ల పెంపకం, ఇతర అనేక వ్యాపారాలలో ప్రోత్సహిస్తూ మహిళలను ముందంజలో ఉంచే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణ

మిగతా 2లో..

## గుడుంబా స్థావరాలపై పోలీస్, ఎక్సైజ్ శాఖల ఉమ్మడి దాడులు

- 70 లీటర్ల నాటుసారా, 1500 లీటర్ల బెల్లం పానకం పట్టివేత
- నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ హెచ్చరిక

2 లో..

– చెన్నూరు, మార్చి 11, ప్రభాతవార్త



## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను బాధ్యతగా కొనసాగించాలి



**★ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

లక్ష్మణచాంద, మార్చి 11, ప్రభాతవార్త

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను బాధ్యతగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం లక్ష్మణచాంద మండలం పొట్టపల్లి (కె) గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, స్వయంగా చీపురుతో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ.. 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరి ఆర్థికంగా ఎదగాలని, వారికి వివిధ వస్తువుల తయారీలో శిక్షణ ఇప్పించి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బాల్య వివాహాలు చేయవద్దని గ్రామస్తులకు సూచించారు. తర్వాత నర్సరీని సందర్శించి మొక్కల పెంపకంపై ఆరా తీశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలను మిగతా 2లో..

## జనాభా లెక్కల విధులు.. సమర్థవంతంగా నిర్వహించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

రూపకల్పనకు పునాది వంటివని తెలిపారు. పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల కల్పనకు, అలాగే సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేయడానికి ఖచ్చితమైన గణాంకాలు అవసరమని తెలిపారు. వయస్సు, విద్యార్హత, వృత్తి, సామాజిక వర్గం, మౌలిక వసతుల వివరాలు వంటి అంశాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని, ఖచ్చితమైన సమాచారం మాత్రమే నమోదు చేయాలని, 33 అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాలని తెలిపారు. మొదటి దశలో నివాస గృహాలతో పాటు అన్ని రకాల భవనాలు, కుటుంబ వివరాలను, 2వ దశలో వ్యక్తిగత వివరాలను సేకరించడం జరుగుతుందని, దేశంలోనే తొలిసారిగా డిజిటల్ పద్ధతి ద్వారా జనాభా గణనను పూర్తిగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జనాభా గణనలో అందరూ పాల్గొని వాస్తవ వివరాలను వెల్లడించాలని, ఎవరి వివరాలు బహిర్గతం కాకుండా, సర్వర్‌లో నేరుగా నిల్వ ఉండేలా సాంకేతికతను ఉపయోగించడం జరుగుతుందని తెలిపి. స్వీయ ప్రకటన చాలా ముఖ్యమని, అధికారులు, ఎన్యూమరేటర్లు సమన్వయంతో పనిచేయాలని, అధికారులు ప్రతి రోజు జనాభా గణన ప్రక్రియను సమీక్షించాలని, నిర్ణీత కాలపరిమితిలోపు జనాభా గణన ప్రక్రియను మెరుగైన రీతిలో పూర్తి చేయడానికి అందుబాటులో ఉన్న సిబ్బంది సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు దోహదపడే జనాభా గణన ప్రక్రియను నిబద్ధతతో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీస్, ఎక్సైజ్ శాఖల ఉమ్మడి దాడులు

**చెన్నూరు, మార్చి 11, ప్రభాతవార్త**

నాటుసారాకు అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, కుటుంబాలను రోడ్డున పడేయవద్దని, చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ ప్రజలకు సూచించారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని ఆల్గాం గ్రామంలో పోలీస్, ఎక్సైజ్ శాఖల అధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. గ్రామంలోని గుడుంబా తయారీదారుల ఇండ్లలో తనిఖీలు నిర్వహించి 1500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. నలుగురు మహిళల నుంచి 70 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు.

### సారాకు అలవాటుపడి కుటుంబాలను రోడ్డున పడేయవద్దు..

గుడుంబాకు అలవాటు పడిన యువకులు, పెద్దలు ప్రాణాలు కోల్పోతున్నారని, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరైనా గుడుంబా తయారు చేసిన, అమ్మినా, గుడుంబా ముడి సరుకులు సరఫరా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు సారా తయారీలో వాడే పాత్రలు, డ్రమ్ముల విక్రయాలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు.

### గుడుంబా రహిత గ్రామం మీ చేతుల్లోనే..

గుడుంబా రహిత గ్రామంగా ఉండాలంటే అది మీ చేతుల్లోనే ఉందని సీఐ కృష్ణ అన్నారు. గ్రామ సర్పంచ్‌లు, పెద్దలు యువకులు, మహిళలు ప్రత్యేకంగా చొరవ చూపాలన్నారు. అందుకుగాను వారికి అవగాహన కల్పించి పంచాయతీల్లో గుడుంబా నిషేధ తీర్మానాలు చేయాలన్నారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి గుడుంబా నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, ఎక్సైజ్ ఎస్సై వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

## సాఫ్ట్ బాల్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన బెల్లంపల్లి సీఓఈ విద్యార్థులు

**బెల్లంపల్లి, మార్చి 11, ప్రభాతవార్త**



ఈనెల 7 నుంచి 9 వరకు నెల్లికుదురు, మహబూబాబాద్ జిల్లాలో జరిగిన 69వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ అండర్ 14 బాల బాలికల టోర్నమెంట్లో అదిలాబాద్ జిల్లా బాలుర జట్టు సిఓఈ బాయ్స్ నుంచి 9 మంది విద్యార్థులు జట్టులో ఉండడం బెల్లంపల్లి సిఓఈ ప్రిన్సిపాల్ ఆకిడి విజయ సాగర్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ తన్నీరు గోపి, అధ్యాపక బృందం అభినందించారు. సెమీఫైనల్ లో మెదక్ జిల్లా జట్టుపై 907 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌లో చేరి ఫైనల్‌లో నిజామాబాద్ జిల్లా జట్టుపై తలపడి 0302 పరుగుల తేడాతో గెలిచి ప్రథమ స్థానంలో నిలిచి ఈ యొక్క టోర్నమెంట్, బంగారు పతకాలు అందుకున్నారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులు వివరాలు డి. విశ్వతేజ, బి. రిసెంద్ర వర్మ, జి. సుశాంత్, ఏ. గౌతం, ఎస్. విజయ్ చంద్ర, ఏ. శ్రీహర్షవర్ధన్, ఎస్. కృష్ణ అర్జున్, ఏ. సంకీర్, సాయి విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు, మెడల్స్ అందజేశారు. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా బండి. రవి, ఆల్లూరి. వామన్ వ్యవహరించినట్లు మంచిర్యాల జిల్లా సెక్రటరీ యాకూబ్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కోచ్ మేనేజర్లను జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్ ముచ్చకుర్తి రాజశేఖర్ ను విద్యార్థులను అభినందిస్తూ ఆల్ ది బెస్ట్ తెలిపారు.

## స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా

# ఇందిరా మహిళా శక్తి పథకం

**(మొదటిపేజీ తరువాయి)**

సదుపాయం కల్పించి, బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా వ్యాపార అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. రుణం పొందిన స్వయం సహాయక సంఘాలు సకాలంలో చెల్లించి తిరిగి రుణం పొంది తమ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. మహిళలు తాము చేపట్టిన వ్యాపారాలను క్రమ పద్ధతిలో నిర్వహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రాయితీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జైపూర్ మండలం లోని 20గ్రామపంచాయతీలకు 753 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 200 ఇండ్లు స్లాబ్ స్థాయిలో ఉన్నాయని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాని అర్హులైన లబ్ధిదారులకు వచ్చే విడతలో అందించడం జరుగుతుందని తెలిపారు. 15 సంవత్సరాల వయసు కలిగిన బాలికలకు ప్రభుత్వం హెచ్‌పివి వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తుందని, భవిష్యత్తులో క్యాన్సర్ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జైపూర్ మండలంలో చేపట్టిన 1 వెయ్యి 250 మెగావాట్ల పవర్ ప్లాంట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని, ప్లాంట్ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోయిన పట్టాదారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా దాదాపు 13 వేల కోట్ల రూపాయలతో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలతో చెన్నూరు నుంచి హైదరాబాద్ వరకు బస్సు సర్వీసులను నిర్వహించడం జరుగుతుందని, అదనంగా మరొక బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ప్రజా సంక్షేమంలో భాగంగా గ్యారంటీ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి జిల్లాలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపల్ కార్పొరేటర్లు/కౌన్సిలర్లకు జిల్లా కేంద్రాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండలంలోని 39 మంది కల్యాణలక్ష్మి /షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. నిరుపేద ఆడపడుచులకు వివాహానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, మండలంలో ఇప్పటివరకు 375 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా అదనపు ఆదాయం పొందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలలో కార్యాలయ భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహిళా సమాఖ్య భవనాల ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చర్యలు చేపట్టడం జరుగుతుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేయడం జరిగిందని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలను 3 శాతం విద్యార్థుల సంఖ్య పెంపొందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామైఖ్య సంఘాల మహిళలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను బాధ్యతగా కొనసాగించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

తనిఖీ చేసి, విద్యార్థులతో బోర్డుపై అక్షరాలు చదివించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఈఓ భోజన్న, జెడ్పీ సీఈఓ శంకర్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, సర్పంచ్ ముఖేష్, కార్యదర్శి ప్రియాంక పాల్గొన్నారు.

## కార్మికులకు ప్రతి నెల మొదటి వారం జీతాలు చెల్లించాలి

**- ప్రతి కార్మికుడికి ఈపిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలి**

**- సెంట్రల్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ విశ్వ భూషణ్**

**జైపూర్, మార్చి 11, ప్రభాతవార్త**



సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికులకు ప్రతి నెల 7వ తేదీన జీతాలు చెల్లించాలని సెంట్రల్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వ భూషణ్ అన్నారు. బుధవారం జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆయన పర్యటించి, వివిధ ఏజెన్సీల ప్రతినిధులకు,కార్మికులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్టిపిపి జి.ఎం. నరసింహారావు, (పీసీఎస్) అండ్ (ఓ అండ్ ఎం) జి.ఎం. మదన్మోహన్ పూల మొక్కతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న వివిధ కాంట్రాక్టు ఏజెన్సీలను పిలిచి వారి రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి ఒక్క ఏజెన్సీ తమ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెలా ఏడో తేదీ లోపల జీతాలు చెల్లించాలని. అలాగే ప్రతి కార్మికుడికి పి.ఎఫ్ ఈ.ఎస్.ఐ అందజేస్తూ సంబంధిత స్లిప్‌లను అందజేశారు.అనంతరం ప్లాంట్ కి మొదటిసారి వచ్చిన డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ ను జీఎంలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ యూసఫ్, డీజిఎం (సి అండ్ ఐ) శివప్రసాద్, డీజీఎం (పర్సనల్) కిరణ్ బాబు ఇతర అధికారులు వివిధ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా ఫేర్వెల్ డే

**లక్షెట్టిపేట, ప్రభాతవార్త**

జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, లక్షెట్టిపేటలో పదవ తరగతి విద్యార్థినిలకు వీడ్కోలు సమావేశం ఆసాంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మండల విద్యాధికారి జి. శైలజ అధ్యక్షత వహించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా తను మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, సామాజిక అవగాహనతో ముందుకు సాగినప్పుడే సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలియజేశారు. ఈ సమావేశంలో వివిధ ఉపాధ్యాయినిలు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు కలిగి ఉన్నప్పుడే ఆదర్శప్రాయమైన జీవితం కలిగివుంటారని, ఇతరులకు మార్గదర్శకులుగా తయారు అవుతారని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల తమ అభిప్రాయాలను, భావాలను వ్యక్తం చేస్తూ, తమ గురువులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశం విద్యార్థుల నృత్యాలతో, పాటలతో, ఉపాధ్యాయుల సందేశాలతో కనుల విందుగా సాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మండల విద్యాధికారి

# నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే మార్కెట్‌లో నిలదొక్కుకోగలం

☆శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ ☆ 22 రోజుల ముందే లక్ష్యాన్ని చేరిన ఎస్సార్పీ 1 గని



కార్మికులకు బహుమతులు అందజేస్తున్న మునిగంటి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

నస్పూర్, మార్చి 11, ప్రభాతవార్త

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ద్వారానే మార్కెట్‌లో నిలదొక్కుకోగలమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం ఎస్సార్పీ 1 గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపునకు 22 రోజుల ముందే వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించిన అధికారులు, కార్మికులను అభినందించారు. రక్షణతో కూడిన ముందస్తు ఉత్పత్తి కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరిని ఈ సందర్భంగా ప్రశంసించారు. సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్ ఏరియా భూగర్భ గనులు సత్తా చాటుతున్నాయని ఆయన వివరించారు. ఆర్.కె న్యూటెక్ గని బాటలోనే ఎస్సార్పీ 1 సైతం నిర్ణీత గడువు కంటే ముందే లక్ష్యాన్ని చేరుకోవడం సంతోషదాయకమని మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 19 నాటికే 40 రోజుల ముందుగా లక్ష్యాన్ని సాధించి ఆర్.కె న్యూటెక్ గని సింగరేణిలోని అన్ని గనుల్లో మొదటి వరుసలో నిలిచిందని గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో గని జీవితకాలం పెంపునకు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై కార్మికులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఉత్పత్తి లక్ష్య సాధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మునిగంటి శ్రీనివాస్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, ఎస్సార్పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, గని మేనేజర్ ఆత్మారాం సహాని, రక్షణ అధికారి గోవిందచంద్ర ముర్ము, సంక్షేమ అధికారి అరుణ్ తేజ, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, సూపర్ వైజర్లు, మైనింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

## నర్సరీ, వాటర్ ట్యాంక్‌ను తనిఖీ చేసిన అధికారులు

సారంగాపూర్, మార్చి 11, ప్రభాతవార్త

మండలంలోని జాం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్ బుధవారం నర్సరీని తనిఖీ చేశారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా వాటర్ ట్యాంక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వాల్స్‌ను వారు పరిశీలించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరిపే రవళి విలాస్, గ్రేడ్ ఏఈ ఫిరోజ్ ఖాన్, ఇంట్రా ఏఈ విష్ణు రాథోడ్, సూపర్వైజర్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.


సాధు సమ్మేళనానికి హాజరైన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## తేజాపూర్ సాధు సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నేరడిగొండ, మార్చి 11, ప్రభాతవార్త:

మనం ధర్మాన్ని కాపాడితే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన వేదాంత విజ్ఞాన మహాసభలు, సాధు సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలోని చిన్న గ్రామమైన తేజాపూర్‌లో ఇంత పెద్ద ఎత్తున సాధు సమ్మేళనం జరగడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఋషులు, మునులు చూపిన ధర్మ మార్గమే మనకు నిదర్శనమని పేర్కొన్నారు. దేవుడి ఆశీర్వాదంతో ప్రజలందరితో ఒకడిగా ఉంటూ సేవ చేస్తానని చెప్పారు. కార్యక్రమ నిర్వాహకులు శివానంద భారతి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అండగా నిలవడం వల్లే ఈ సమ్మేళనం విజయవంతమైందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి, అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ

సారంగాపూర్, మార్చి 11, ప్రభాతవార్త:

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. బోరిగాం, గోడిసేర, దని, వంజర్, ప్యారాముర్, వైకుంఠాపూర్, కంకెట, మలక్ చించోలి గ్రామాల్లో మహిళా సంఘాల (శీబీబి జువీ) భవనాలు, వర్కింగ్ షెడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల ప్రహరీ గోడల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు, పాలన సాగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు నిధుల విడుదల చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీ   ్మకాంత్, బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షుడు నరేష్, పార్టీ కార్యకర్తలు, సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే



## గోరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

దండేపల్లి, మార్చి 11, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో గోసంరక్షణ సమితి మండల ప్రభాత్ బొమ్మెన మహేష్ అధ్యర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి గిత్తే సూర్య కాంత్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గోసంరక్షణ కొరకు గోమాతను కాపాడుట కొరకు 9067777323 నెంబర్‌కు మిస్డ్ కాల్ చేయండి. అదే విధంగా ఏప్రిల్ 27న మండల్ లెవల్లో తహసీల్దార్‌లకు వినతి పత్రాలు అందజేస్తు మండలానికి 11 వేల సంతకాలను సేకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలుగురి వేణు, కొండ నరేష్, వనపర్తి రాకేష్, ఒడ్నాల శంకర్, ఎలుగురి కావ్య, నాగసముద్రం సర్పంచ్ సంధుర్ సుగుణ, జిల్లా ఉత్తమ ప్రకృతి వ్యవసాయ మహిళా రైతు బొమ్మెన లావణ్య, అక్కల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## అన్నదాతల సంక్షేమం కోసం కృషి చేయాలి

చెన్నూరు, మార్చి 11 ప్రభాతవార్త

నూతనంగా కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు రైతుల సంక్షేమం కోసం వారికి అన్ని విధాలా అండగా నిలవాలని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారీతో పాటు కమిటీ సభ్యులు బుధవారం రోజున ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని, వారి అవసరాలు తీర్చేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన పని చేస్తుందని, ప్రభుత్వం ఏర్పాటు కాగానే 23 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిందని అన్నారు. అనంతరం నూతన మార్కెట్ కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

## పిచ్చి మొక్కల తొలగింపునకు విజ్ఞప్తి

ఇచ్చోడ, మార్చి 11, ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ప్రజలకు ఇబ్బందిగా మారాయి. పిచ్చి మొక్కలు గుబురుగా పెరగడంతో దోమలు, ఈగల సంచారం పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి పక్కనే వెజిటబుల్, మీట్ మార్కెట్లు ఉండటంతో కొందరు ఆవరణలోనే చెత్త వేస్తున్నారని స్థానికులు తెలిపారు. చెత్త వేసే వారిపై జరిమానా విధించాలని, నిఘా కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

### - కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్

నేరడిగొండ, మార్చి 11, ప్రభాతవార్త:

ఆధ్యాత్మికతతోనే మానవాళికి నిజమైన మనశాంతి లభిస్తుందని బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ తెలిపారు. నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న సాధు సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాధువులను దర్శించుకుని వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన ప్రాంతంలో ఇంత గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమం జరగడం సంతోషకరమని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. భక్తిలోనే అసలైన శక్తి ఉందని, అది మనిషికి ప్రశాంతతను ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.


సాధు సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆడే గజేందర్

### జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో

# మహిళా దినోత్సవ సెంట్రల్ ఫంక్షన్

జైపూర్, మార్చి 11, ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో బుధవారం సెంట్రల్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆశాకిరణ్ నరసింహారావు హాజరుగా, ఎం. విజయలక్ష్మి మదన్మోహన్ సభాధ్యక్షురాలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ ర్యాలీని ఎస్టీపిపిలోని ఆడిటోరియం నుంచి టౌన్షిప్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆశాకిరణ్ నరసింహారావు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంవత్సరం మహిళా దినోత్సవం ఆదివారం రోజు వచ్చినప్పటికీ,మహిళల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా టౌన్షిప్‌లోని మహిళా ఉద్యోగులను గృహిణులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, వివిధ ఆటల కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ ప్రతిభను చూపారన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఒకే వేదికపై కలుసుకోవడం చాలా ఆనందకరమైన విషయమని తెలియజేశారు. ఫారెస్ట్ విభాగంలో సివిల్ వర్క్‌లో పనిచేస్తున్న మహిళలకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వర్షంలోనూ, ఎండలోనూ కఠిన పరిస్థితులలో పనిచేస్తూ పచ్చదనాన్ని కాపాడడం, అలాగే ప్లాంట్,టౌన్షిప్




పరిసరాలను మరింత అందంగా మార్చడంలో వీరి కృషి అభినందనీయమన్నారు. అలాగే సిఐఎస్ఎఫ్‌లో పని చేస్తున్న మహిళా మణులను అభినందించారు. దేశానికి, ముఖ్య సంస్థలకు భద్రత కల్పించడం చాలా బాధ్యత తో కూడిన పని. మీ ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావం మనందరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అలాగే డీటీపి కోర్సులు నేర్చుకుంటున్న మహిళా విద్యార్థుల కు కూడా అభినందనలు తెలియజేశారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా వీరు తమ భవిష్యత్తుకి కొత్త అవకాశాలను సృష్టించుకుంటున్నారని ఈ సందర్భంగా కొనియాడారు. అలాగే టౌన్షిప్ లోని గృహిణులను కూడా ప్రత్యేకించి అభినందించాలని అన్నారు. కుటుంబాన్ని చూసుకోవడమే కాకుండా పిల్లల భవిష్యత్తును నిర్మించడం పెద్దలను చూసుకోవడం వంటి బాధ్యతలను ఎంతో ప్రేమతో నిర్వర్తిస్తున్నారన్నారు. గృహిణులు కుటుంబాలకి బలమైన ఆధారస్తంభాలన్నారు. మహిళా సాధికారత కోసం మనం విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆత్మవిశ్వాసం మూడు ముఖ్యమైన విషయాలను పాటించాలన్నారు. మహిళలు ఒకరికొకరు తోడ్పడితే సమాజం మరింత బలంగా మారుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండలం ఎమ్మార్వో వనజా రెడ్డి, వనమాల వెంకటేశ్వర్లు, లత పరశయ్య, రాజేశ్వరి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ డి కిరణ్ బాబు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్. ఇతర మహిళా ఉద్యోగినులు, మహిళా సిబ్బంది. టౌన్షిప్ మహిళలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ అసోసియేషన్ సభ్యులు

## అంగన్‌వాడీల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తుతా: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మార్చి 11, ప్రభాతవార్త:

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో గళమెత్తుతానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హామీ ఇచ్చారు. నేరడిగొండ మండల అంగన్‌వాడీ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి, తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రీప్రైమరీ విద్యను అంగన్‌వాడీల ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. 1 లక్ష అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ఆయన విమర్శించారు.



## పశువులకు గాలికొంటు వ్యాధి నివారణ టీకాలు

నేరడిగొండ, మార్చి 12, ప్రభాతవార్త:

పశువులకు గాలికొంటు వ్యాధి సోకకుండా రైతులు ముందస్తుగా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రాథోడ్ జీవన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల వల్ల పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించడం ద్వారా పశువులను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ గులాబ్ సింగ్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## మహంకాళి జాతరకు రావాలని సిపి కి ఆహ్వానం

తాండూర్, మార్చి 11, ప్రభాతవార్త :

ఏప్రిల్ 3న నిర్వహించనున్న మహంకాళీ జాతరకు రావాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ను ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ స్వామి,ఆలయ అధ్యక్షుడు మోడెమ్ తిరుపతి గౌడ్, కమిటీ సభ్యులు ప్రవీణ్, ప్రవీణ్ ఆహ్వానించారు. రామగుండం కార్యాలయంలో సిపిని జాతర నిర్వాహకులు కలిసి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గాదేవి, స్వయంభూ శ్రీ మహంకాళీ దేవస్థానం విశిష్టతను వివరించి జాతరకు రావాలని కోరారు.

## విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

తాండూర్, మార్చి 11, ప్రభాతవార్త :

ఈనెల 14 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించాలని హెచ్ఎం ఉమాదేవి కోరారు. తాండూర్ మండలం అచ్చలాపూర్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు బుధవారం తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని హెచ్ఎం కోరారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరిని అలరించాయి.ఏఎంసి చైర్మన్ చిలకమ్మ, సర్పంచ్ స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రతపై విద్యార్థుల ర్యాలీ

తాండూర్, మార్చి 11, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని విద్యా భారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం రోడ్డు భద్రతాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్, ప్రిన్సిపల్ సరోజిని పాల్గొన్నారు.





రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

ఉట్నూర్, మార్చి 11,ప్రభాతవార్త :


స్థానిక జడ్పీ ఎస్ ఎస్ పాఠశాల విద్యార్థుల కి హెడ్ స్వచ్ఛంద సంస్థ తరపున స్థానిక సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్ చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్లను అందించారు.అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ రమేష్ .హెడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రాథోడ్ ఉపేందర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పవార్ కృష్ణ ,మహేందర్,వందిరి భీమన్న,నారా సాయి,బాల కృష్ణా, బొంతల భీమన్న,శ్రీకాంత్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా వంగిన విద్యుత్ స్తంభం

❋ భయాందోళనలో రైతులు

ఇచ్చోడ, మార్చి 11, ప్రభాతవార్త

ఇచ్చోడ మండలంలోని బాదిగూడ గ్రామ సమీపంలో ఒక విద్యుత్ స్తంభం ఒకవైపునకు వంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభం ఏ క్షణంలోనైనా కూలిపోయే స్థితిలో ఉండటంతో పొలాల్లో పనులు చేసుకునే రైతులకు ప్రాణసంకటంగా మారింది. నిత్యం రైతులు, కూలీలు తిరిగే మార్గంలో ఈ స్తంభం ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, పాత స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.





## శీతలాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**బెల్లంపల్లి, మార్చి 11, ప్రభాతవార్త**

శీతలాష్టమి శుభ సందర్భంగా రాజస్థానీ సమాజానికి చెందిన కుటుంబాలు బెల్లంపల్లి పట్టణంలోని ప్రసిద్ధ పురాతన గుంథెమ్మగుట్ట సల్ల పోచమ్మ ఆలయంలో భక్తితో శీతల మాతకు బసోడ చల్లని ప్రసాదం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వృద్ధ మహిళలు వారి పిల్లలతో కలిసి ఆచార బద్ధంగా పూజలు చేసి కుటుంబ ఆనందం, శాంతి, ఆరోగ్యం కోసం శీతల మాతను ప్రార్థించారు. అనాదిగా వస్తున్న ఆచారాల ప్రకారం హోలికా దహనం తర్వాత ఎనిమిదో రోజు శీతలాష్టమిని రోగాలు, అంటు వ్యాధుల నుండి రక్షించే దేవతగా భావిస్తారు. శీతల మాతను పూజించడం వల్ల వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందని, కుటుంబానికి ఆనందం, శాంతి లభిస్తుందని భక్తులు నమ్ముతారు. శీతలాష్టమి రోజు సూర్యోదయానికి ముందే ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. ఆమె ఆశీర్వాదం పొందడానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించారు. ఈ పండుగ ఉత్తర భారత ప్రాంతంలో ఐక్యత, భక్తిని పెంపొందిచేదని భక్తులు నమ్ముతారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## రైతులు ప్రభుత్వ రాయితీలపై అవగాహన కలిగి ఉండాలి

**- జిల్లా ఉద్యానవన అధికారి అనిత**

**లక్షెట్టిపేట, మార్చి 11, ప్రభాతవార్త**

రైతులు ప్రభుత్వం ద్వారా అందే రాయితీల పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉద్యానవన అధికారి అనిత అన్నారు. లక్షెట్టిపేట మండలంలోని డౌడేపల్లి, సూరారం గ్రామాలలో ఉద్యాన శాఖ ద్వారా రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఇందులో బాగంగా ఆయిల్‌పామ్ ద్వార రైతులకు ప్రభుత్వ రాయితీలు, ఆయిల్‌పామ్ యొక్క ప్రయోజనాలు, ప్రాముఖ్యతను 2 రోజులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు ఉద్యాన శాఖలో వివిధ పథకాలు పై జిల్లా ఉద్యానవన అధికారిణి అనిత అవగాహన కల్పించారు. అనంతరం ఆయిల్‌పామ్ ఫీల్డ్‌ని సందర్శించారు. ఇందులో ఉన్న ప్రతి సూక్ష్మ విషయం గురించి రైతులు అడిగి తెలుసుకున్నారు. మొక్క ఎదుగుదల, కావాల్సిన తెగుళ్ల నిర్వహణ, పోషకాల నిర్వహణ, క్షేత్ర నిర్వహణ గురించి హార్టికల్చర్ అధికారి సహజ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మ్యాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్ కుమార్, ఆయిల్‌పామ్ యొక్క మార్కెటింగ్ నిర్వహణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీకాంత్, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయిల్‌పామ్ రైతులు, మ్యాట్రిక్స్ కంపెనీ క్షేత్ర సిబ్బంది, ఆయిల్‌పామ్ ఆసక్తి గల రైతులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్




శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

# ఏఐ ద్వారా ప్రతి విద్యార్థి యొక్క అభ్యాస వేగం, సామర్థ్యానికి అనుగుణంగా నేర్చుకునే అవకాశం

**- జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్**

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 11, ప్రభాతవార్త :**

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రతి విద్యార్థి యొక్క అభ్యాస వేగం, సామర్థ్యానికి అనుగుణంగా నేర్చుకునే అవకాశం కలుగుతుందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ అన్నారు. ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్ కాగజ్ నగర్ లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్నికి హాజరైన ఉపాధ్యయులకు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాటాన్లడుతూ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 14 ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యాబోధన కొనసాగుతున్నదని, త్వరలో మరో నాలుగు పాఠశాలల్లో ప్రారంభించడం జరుగుతుందని,ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసిలో భాగంగా తెలుగు, ఆంగ్లము, గణితము సబ్జెక్టులలో కనీస అభ్యసన సామర్థ్యాల సాధనలో వెనుకబడిన 3,4,5 తరగతుల విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు, దీని ద్వారా విద్యార్థులు గణితంలో గణనీయమైన పురోగతిని సాధించారని, తెలుగు, ఆంగ్లంలో కూడా అభివృద్ధిని సాగించడానికి కృషి చేయాలని, అంతేకాకుండా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రతి విద్యార్థి యొక్క అభ్యాస వేగం, సామర్థ్యానికి అనుగుణంగా నేర్చుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. త్వరగా నేర్చుకునే విద్యార్థులు ముందుకు సాగవచ్చు, మెల్లగా నేర్చుకునే వారికి అదనపు సహాయం లభిస్తుందని, పాఠాల ప్రణాళిక, మూల్యాంకనం, విద్యార్థుల ప్రగతిని గమనించడంలో తిశ్రీలి ఉపాధ్యాయులకు సహాయపడుతుందని,అంతేకాకుండా వేర్వేరు అభ్యాస సామర్థ్యాలున్న విద్యార్థులకు కూడా సమానంగా నేర్చుకునే అవకాశం కలుగుతుందని,ఏఐ ఆధారిత విద్య ద్వారా విద్యార్థులు భవిష్యత్ ఉద్యోగాలు, సాంకేతిక ప్రపంచానికి సిద్ధమవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, రిసోర్స్ పర్సన్లు శివరాజ్, సంజయ్, మహేశ్వర్, జలపతిరావు పాల్గొనడం జరిగింది.



## అధికారుల నిర్లక్ష్యం - పురపాలిక దుర్గంధం

**క్యాతన్‌పల్లి, మార్చి 11,ప్రభాత వార్త**

రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, మౌలిక వసతుల కల్పన, త్రాగు నీరు,మురికి కాలువలను శుభ్రం చేయడం అనే అంశాలను ప్రధానంగా నిర్వహించాలని క్షేత్ర స్థాయిలో జిల్లా స్థాయి అధికారి మొదలు కొని ప్రతి ఒక్కరు చర్యలు చేపడుతున్నారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మాత్రం భిన్నమైన ధోరణి అవలంబిస్తున్నారు. మురికి కాలువలను శుభ్రం చేసి, చెత్త ను తరలించడంలో రోజుల తరబడి నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కాలనీలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. సంబంధిత అధికారులకు స్థానికులు సమాచారం అందించినప్పటికీ, స్పందన కరువైందని మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికి కాలువల నుండి తీసిన చెత్తను తరలించాలని కోరుతున్నారు.

## ఈ లోకంలో అన్నింటికంటే శాశ్వతం స్నేహం మాత్రమే: మునిగంటి శ్రీనివాస్

**- సింగరేణి హైస్కూల్‌లో ఘనంగా పదో తరగతి వీడ్కోలు వేడుకలు**

**నస్పూర్, మార్చి 11, ప్రభాతవార్త**

ఈ లోకంలో అన్నింటికంటే శాశ్వతం స్నేహం మాత్రమేనని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా సీసీసీ సింగరేణి హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేసి వంద శాతం ఫలితాలతో పాఠశాలకు, సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కష్టనష్టాల్లో అందరికంటే ముందు అండగా నిలిచేది స్నేహితులు మాత్రమేనని గుర్తుచేశారు. పాఠశాల దశలో ఏర్పడే స్నేహబంధం ఎప్పటికీ మరువలేనిదని మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ చదువులతో పోలిస్తే పదో తరగతిలో ఉండే అనుబంధం ఎంతో మధురమైనదని వివరించారు. విద్యార్థులు వీడ్కోలు వేడుకలను ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం వార్షిక పరీక్షలపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి జీవితంలో స్థిరపడి తల్లిదండ్రులకు, గురువులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు సొంత ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. పరీక్షల పట్ల భయం వీడాలని కోరారు. ప్రణాళికాబద్ధంగా సిద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పదో తరగతి విద్యార్థులు పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




## బెల్లంపల్లిలో పారిశుద్ధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహణ కార్యక్రమం

**బెల్లంపల్లి, మార్చి 11, ప్రభాతవార్త**




తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అదేవిధంగా బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సూచనల మేరకు ప్రజా ప్రభుత్వంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీ 34 వార్డులలో నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, తోటి కౌన్సిలర్‌లతో కలిసి మున్సిపాలిటీలోని 5,11,28వ వార్డులలో పర్యటించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణ తీరు, జరుగుతున్న పారిశుద్ధ పనులను పరిశీలించారు. అనంతరం పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, తడి చెత్తపొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయా వార్డులలో నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. చెత్తను మీ విధులలోకి వచ్చే మున్సిపల్ చెత్త బండిలో మాత్రమే వేయాలని ప్రజలకు తెలిపారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా, స్వచ్ఛ బెల్లంపల్లి గా మార్చేందుకు అన్ని వార్డుల ప్రజలు సహకరించాలని కోరారు.

# ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలకు సజావుగా రాయాలి

**- ఏఎస్పీ చిత్త రంజన్**

కెరమెరి మార్చి 11 ప్రభాతవార్త:

పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలను సజావుగా రాయాలని ఏ ఎస్ పి చిత్తరంజన్ అన్నారు బుధవారం మండలం లోని మోడీ కేజీబీవీ పాఠశాలలో పోలీసుల మీకోస్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక ప్రణాళిక రూపొందించుకొని ప్రతి సబ్జెక్టుకు సంబంధించి గత ప్రశ్నాపత్రాలను సాధన చేయాలని సూచించారు. ఎలాంటి భయం, కంగారు లేకుండా పరీక్షలు రాయాలని, ఒత్తిడికి లోనుకాకుండా ఇప్పటివరకు చదివిన పాఠాలను గుర్తు చేసుకుని సమర్థంగా రాయాలని తెలిపారు.పదో తరగతి మార్కులే ఉన్నత విద్యాభ్యాసంలో కీలకమని పేర్కొన్నారు. ఇప్పటి పాఠ్యాంశాలే రానున్న తరగతుల్లో మరింత విస్తృతంగా ఉంటాయని చెప్పారు. కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని అలాగే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ ఎస్సై మధుకర్ సర్పంచ్ ఆత్రం లక్ష్మణ్ ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెన్నులు, ప్యాడ్, వాటర్ బాటిల్ పంపిణీ చేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్



జిల్లా విద్యాశాఖ అధికారి లలితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## జిల్లా విద్యాధిశాఖ అధికారికి సన్మానం

కాగజ్‌నగర్ రూరల్ ,మార్చి 11, ప్రభాతవార్త :

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి లలితను బుధవారం పీఆర్‌టీయూ తెలంగాణ తరపున మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంలో పీఆర్‌టీయూ తెలంగాణ అన్నివేళల సహకరిస్తుమని ఈ సందర్భంగా వారు తెలిపారు. పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, జిల్లా జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి,రాష్ట్ర కార్యదర్శి సామల శ్రీవర్ధన్, జిల్లా అధ్యక్షుడు తొటమ్ శ్యాంసుందర్,ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు దుర్గం మారుతి, మండల ప్రధాన కార్యదర్శి వడై ఉమేష్,ఆసిఫాబాద్ మండలం అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మల్లేష్ శేఖర్, శ్రీనివాస్ కలిసిన వారిలో ఉన్నారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా సేఫ్టీ అవగాహన ర్యాలీ

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 11, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, సేఫ్టీ డే సందర్భంగా బుధవారం కాగజ్‌నగర్‌లో సిర్పూర్ పేపర్ మిల్స్ (ఎస్పీయం) ఆధ్వర్యంలో సేఫ్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్యాక్టరీల శాఖ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల్లో భద్రతపై అవగాహన కల్పించినట్లు వారు తెలిపారు. ఈ ర్యాలీలో సిర్పూర్ పేపర్ మిల్స్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని భద్రతా నియమాలను పాటించాలనే సందేశాన్ని ప్రజలకు తెలియజేశారు. ర్యాలీ ద్వారా పారిశ్రామిక రంగంలో భద్రతా చర్యల ప్రాముఖ్యతను వివరించారు.ర్యాలీ సందర్భంగా ప్రజలు, ఉద్యోగులు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) శ్రీ ఏ.కె. మిశ్రా, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నిజామాబాద్ లక్ష్మి కుమార్, జీఎం (హెచ్ఆర్ఐఆర్) ఎం.ఎస్. గిరి, మేనేజర్ (సేఫ్టీ) శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, సిర్పూర్ పేపర్ మిల్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సేఫ్టీ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీయం ప్రతినిధులు, ఉద్యోగులు

## ఆత్మవిశ్వాసమే మొదటి బలం

**- వ్యక్తిత్వ వికాస నిపుణులు తాడూరి శ్రీనివాస్ ఆచార్య**

తాండూర్, మార్చి 11, ప్రభాతవార్త :

ఆత్మవిశ్వాసమే మొదటి బలమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు తాడూరి శ్రీనివాస్ ఆచార్య అన్నారు. రేచిని జెడ్పి ఎస్ఎస్ లో బుధవారం పరీక్షలు వ్యక్తిత్వ వికాసం పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు జరిగే పరీక్ష నా జీవిత లక్ష్యసాధనకు మంచి అవకాశం అని, ప్రతి పరీక్ష నాకు ఒక పండుగ అని, మంచి ఆలోచనతో పరీక్షలు రాయాలని సూచించారు.మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్ట్, గ్రాఫాలజిస్ట్ సత్య ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు ఎలా రాయాలి, భయాన్ని ఎలా తొలగించుకోవాలని అనే అంశాలపైఅవగాహన కల్పించారు.స్పీకర్ సైకాలజిస్ట్ చిరంజీవి మాట్లాడుతూ భవిష్యత్తులో గొప్పగా ఎదగాలంటే, బాగా చదువుకొని లక్ష్యాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మన దేశానికి మంచి పేరు తీసుకు రావాలంటే మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, హెచ్ఎం ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## శ్రీరాంపూర్ ఏరియాలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ పర్యటన

**- కొత్త లేబర్ కోడ్స్‌పై అవగాహన.. కార్మిక సంక్షేమ చర్యలపై సంతృప్తి**

నస్పూర్, మార్చి 11, ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కొత్త లేబర్ కోడ్స్‌పై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, హైదరాబాద్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) బిస్వ భూషణ్ పృష్టి బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్సార్పీ ఓసీపీ కార్మికుల వేతనాలు, హాజరు, సెలవుల రికార్డులను, ఫామ్‌ఏ రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్మికులకు అందుతున్న వైద్య సేవల, పీఎఫ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా సీసీసీ గెస్ట్ హౌస్‌లో లేబర్ కమిషన్ బృందానికి ఎస్సార్పీ ఓసీపీ సంక్షేమ అధికారి ఓంకార్ బాబు, శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం అనిల్ కుమార్ పూర్తి వివరాలను అందజేశారు. ఉద్యోగుల వివరాల నమోదు, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ పట్ల బిస్వ భూషణ్ పృష్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌ను బిస్వ భూషణ్ పృష్టి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐకే1ఏ, ఓసీ గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ సుమలత, డీజీఎం అనిల్ కుమార్ పాల్గొన్నారు.



రోడ్డు శుభ్రం చేస్తున్న సిబ్బంది

## వార్డు నెం.8లో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 11, ప్రభాతవార్త :

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని వార్డు నెం.8లో కౌన్సిలర్ ఆధ్వర్యంలో రోడ్స్, నాళాలు శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ బి.తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి 8వ వార్డ్ కౌన్సిలర్ గజ్జల లక్ష్మణ్ లావణ్య కమిషనర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ సిబ్బంది, ఏకేపి జ్యోతి, ఏరియా ఇంచార్జి కాలనీ ప్రజలు,సుమలత, మమతా, వనిత సరోజ,తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్షుడు రాజన్నను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సముద్రాల రాజన్న ఏకగ్రీవం

పెంచికల్‌పేట్, మార్చి 11, ప్రభాత వార్త :

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సముద్రాల రాజన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కమిటీల నియామక ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నియామక ప్రక్రియను బుధవారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ పట్ల రాజన్న చేస్తున్న సేవలను గుర్తించి మండల బాధ్యతలను ఆయనకు అప్పగిస్తున్నట్లు నాయకత్వం ప్రకటించింది. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజన్న మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యూత్ ఫెస్టివల్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే

ఉట్నూర్, మార్చి 11,ప్రభాతవార్త :

ఉట్నూర్ కేంద్రంలోని పీఎంఆర్సీ లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యూత్ ఫెస్టివల్ ప్రోగ్రాం లో కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె ప్రతాప్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్ లో భాగస్వాములు అవుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు, ఇక్కడ 12 రకాల పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చాలన్నారు. నేను కూడా డిగ్రీ చదువుతున్నప్పుడు ఎన్ఎస్ఎస్ విద్యార్థిని అని ఆయన కాలేజీ రోజులు గుర్తు చేసుకున్నారు . జీవితంలో విద్యార్థి దశలోనే ఏదైనా సంకల్పించి , పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించడం సులభం అన్నారు. చదువు తో పాటు అన్ని రంగాల్లో స్టూడెంట్స్ ముందుండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# గనుల అధికారులకు లేబర్ కోడ్స్‌పై మార్గనిర్దేశం

మందమర్రి, మార్చి 11, ప్రభాతవార్త

ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి శాఖకు చెందిన డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సెంట్రల్ బిశ్వ భూషణ్ ప్రుస్టి హాజరయ్యారు. గౌరవ అతిథులుగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సెంట్రల్ మంచిర్యాల అండ్ రామగుండం ఎం.డి. యూసఫ్ చౌటుపల్లి, మందమర్రి ఏరియా ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ (కేకే ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్) మల్లయ్య పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో మందమర్రి ఏరియా ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ మల్లయ్య, ఎస్ఓటు జిఎం జి.ఎల్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్ తదితర అధికారులు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వ భూషణ్ ప్రుస్టిని శాలువా కప్పి సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం వివిధ గనులు, విభాగాలకు చెందిన అధికారులు, సంక్షేమ అధికారులు, కాంట్రాక్టర్లకు నాలుగు లేబర్ కోడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వ భూషణ్ ప్రుస్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను సమగ్రంగా పునర్వ్యవస్థీకరించి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చినట్లు తెలిపారు. నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త చట్టాల అమలు ద్వారా కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భద్రత, వేతన నిర్మాణంలో పారదర్శకత కల్పించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ లేబర్ కోడ్స్‌ను సరైన విధంగా అర్థం చేసుకుని అమలు చేయడం ద్వారా కార్మికులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జిఎం జి.ఎల్ ప్రసాద్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి, డీజీఎం పర్సనల్ అశోక్, సివిల్ ఎస్.ఈ శ్రీధర్, డీవై పీఎం ఎం.డి ఆసిఫ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వంశీతో పాటు అన్ని గనుల సంక్షేమ అధికారులు, కాంట్రాక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**- సివిల్ సర్జన్ పిల్లల వైద్య నిపుణులు డా. మూర్తి**

మందమర్రి, మార్చి 11, ప్రభాతవార్త



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మందమర్రి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో ప్రత్యేక వైద్య నిపుణులచే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శిబిరము నిర్వహించింది. వైద్య శిబిరం ప్రారంభ సమావేశంలో సివిల్ సర్జన్ పిల్లల వైద్య నిపుణులు డా. మూర్తి మాట్లాడుతూ... బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. 14 సంవత్సరాల బాలికలకు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ నివారణ కోసం హెచ్ పి వి టీకా ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, అర్హులైన బాలికలను తల్లిదండ్రుల అనుమతితో బెల్లంపల్లి లక్షెట్టిపేట చెన్నూరు మంచిర్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న టీకా కేంద్రాలకు తరలించాలని ఆయన తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రోగ్రాం అధికారి డా. అనిల్ కుమార్, వైద్యాధికారిణి డా. మానస, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాందేవ్‌లు పర్యవేక్షించారు. ఆర్‌బిఎస్‌కే వైద్యాధికారి డా. పద్మశ్రీ ఆధ్వర్యంలో వారి బృందం ప్రాథమిక పరీక్షలు చేయగా, పిల్లల వైద్య నిపుణులు డా. మూర్తి, గైనకాలజిస్ట్ డా. కిరణ్ కుమారిలు పిల్లలను పరీక్షించి అవసరమైన చికిత్సలు నిర్వహించారు. అవసరమైన పిల్లలకు థైరాయిడ్, సికిల్ సెల్ లాంటి నిర్ధారణ పరీక్షల కోసం రక్త నమూనాలు సేకరించి తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు పంపించారు. పాఠశాలలో వంట గది, కూరగాయలు పప్పు దినుసులు నిల్వ ఉంచిన గదులను డా. మానస ఆధ్వర్యంలోని బృందం పరిశీలించి ప్రత్యేక అధికారికి, వంట మనుషులకు పలు సూచనలు చేశారు. ఈ శిబిరంలో వారితోపాటు కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత, ఆరోగ్య పర్యవేక్షకురాలు విజయ, ఆర్‌బిఎస్‌కే ఫార్మసిస్ట్ అజయ్, ఎల్ టి గట్టయ్య, ఏఎన్ఎంలు సుశీల, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఘనంగా వీడ్కోలు సమావేశం

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 11, ప్రభాతవార్త :

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం చింతగూడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ హాజరయ్యారు. విద్యార్థిని విద్యార్థులు నిర్భయంగా 10వ తరగతి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. జీవితంలో క్రమశిక్షణ, కృషి మరియు పట్టుదలతో ముందుకు సాగితే విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. పాఠశాలలో నేర్చుకున్న విలువలను జీవితాంతం గుర్తుంచుకోవాలని విద్యార్థులకు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు కూడా తమ అనుభవాలను పంచుకుంటూ పాఠశాలలో గడిపిన సంతోషకరమైన క్షణాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం చిన్న తరగతుల విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించి సభను ఆనందంగా ముగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంఈఓ వాసాల ప్రభాకర్

# పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

**- జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే.జనార్ధన్**

**- ఆరెగూడ పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం**

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 11, ప్రభాతవార్త :

పదో తరగతి పరీక్షలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే.జనార్ధన్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరెగూడలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు కొమురం భీం జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే.జనార్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు శత శాతం పాస్ కావాలని కోరారు. గ్రామ సర్పంచ్ భీమన్ కార్ పద్మ వసంతరావు మాట్లాడుతూ విద్య ద్వారా అభివృద్ధి సాధ్యం అని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కొరారు. పిఎస్ హెడ్మాస్టర్ కే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయి చదువులు చదివి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రోహిణి, రామయ్య, ఉపాధ్యాయులు బి. అనిత, సుగుణ, లాలాజీ, మహేష్ సత్యనారాయణ, ఆయేషా, సిద్దిక, పిడి పరమశివ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే.జనార్ధన్



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్